# బాప్‌కోణ్

ఏ బిడ్డైనా తల్లి ముఖంలోకి చూసి, "బాప్‌కోణ్" అని అడగడం విన్నారా? అదే బిడ్డ అదే ప్రశ్నని తండ్రి మీదకు విసిరితే, ఆ తండ్రి చర్మం రాలిపడిపోదా? ఇదే ప్రశ్న ఏడుస్తూ మారాము చేస్తూ అడిగితే,... అది ఇరుగు పొరుగు వాళ్ళు కూడా విన్నప్పుడు, ఆ తల్లితండ్రులకి ఆ బిడ్డను ఏం చేయాలనిపిస్తోంది? ఇలాంటి సందర్భాలు మామూలుగా ఉండవు. కానీ, ఏ కారణం చేతయినా, తండ్రిని ఎప్పుడూ చూడటం సంభవించకపోతే.... స్కూల్లో మిగతా పిల్లలు వాళ్లతండ్రుల గూర్చి ఏవేవో చెప్తూ ఉంటే, ఆ తండ్రిలేని బిడ్డ ఇంటికి వచ్చి తల్లితో, "అమ్మా! నా తండ్రికి ఏమైంది? ఎప్పుడు వస్తారు? నాతోటి పిల్లలంతా వాళ్ళ నాన్నలను గురించి చెబుతూ ఉంటారు. నాకు కూడా మా నాన్నను చూడాలనిపిస్తోంది." అని అడగడం సహజమే. అప్పుడు తల్లి ఆ బిడ్డకు సంతృప్తికరమైన సమాధానం చెప్పక తప్పదు. కొన్ని సినిమాలలో లాగా తాత్కాలికంగా ఓ బాడుగ తండ్రిని ఆ తల్లి తీసుకురావడం అసంభవమేమీ కాదు. అది ఆ పిల్లవాడి ఒత్తిడి మీద ఆధారపడి ఉంటుంది.

జోగిందర్‌సింగ్, పర్వీందర్‌ల పెళ్ళి వారి తల్లిదండ్రులు నిశ్చయించిన ప్రకారమే జరిగింది. అంటే, అది ప్రేమ వివాహం కాదన్నమాట. ఒక వేళ వాళ్ళకే కనక ప్రేమవివాహం చేసుకునే స్వేచ్ఛ ఉండి ఉన్నట్లయితే జోగిందర్‌కు వేరే పెళ్ళి కూతురు పర్వీందర్‌కు వేరే పెళ్ళికొడుకు లభించి ఉండేవాడు. ఎందుకంటే, చాలామంది యువతీయువకులలాగే వీళ్ళిద్దరికీ కూడా పెళ్ళికి ముందు వాళ్ళ వాళ్ళ ప్రేమవ్యవహారాలు నడిచాయి.

ప్రేమ విషయానికొచ్చేసరికి, సర్దార్జీల్లో యువతీ యువలకులకు కొన్ని ప్రత్యేకతలు ఉన్నాయి. వారు గుడ్డిగా ప్రేమలో పడరు. తల్లిదండ్రులకు ఉన్న కేశభారంతో పాటు అదనపు క్లేశభారం కలిగించడం వాళ్ళకి ఇష్టం లేదేమో! యుక్త వయసు వచ్చినవాళ్ళు ప్రేమించదలుచుకుంటే కొంచెం ముందు వెనుకలు చూసుకుని మరీ సెలక్షన్ చేసుకుంటే వాళ్ళ తల్లిదండ్రులకి ఏ సమస్యా ఉండదు కదా! "నాయనా! కొడితే ఏనుగు కుంభస్థలాన్నే కొట్టాలి." అని కొడుకులకు సరియైన సమయంలో సదుపదేశం ఇచ్చే తల్లిదండ్రులు కూడా ఉంటారు. మనకి పుట్టే పిల్లలు బుద్ధిపూర్వకంగా ఇటువంటి ప్రేమలో పడితే ఎంత బాగుంటుంది! అలా కాకుండా, ప్రేమ గుడ్డిది,ప్రేమ దివ్యమైనదని అనుకుంటూ బుద్ధిహీనత

ప్రదర్శిస్తే వాళ్ళ శేషజీవితమంతా ఏ సరోజినీదేవి ఐ హాస్పిటల్‌లోనో లేక అలాంటి మరే చోటనో గడపాల్సి వస్తుంది. అందువల్ల కలిగే ప్రమాదం ఏమిటో తెలుసా? సగం పిచ్చితో పిచ్చాసుపత్రిలో చేరినవాడు పూర్తి పిచ్చివాడుగా మారేటప్పుడు అక్కడ్నుంచి డిశ్చార్జ్ చేయబడతాడు. ఎందుకంటే, తాము చేయాల్సిన పని పూర్తయిన తరువాత రోగుల్నింకా అసుపత్రిలోనే ఉంచడం డాక్టర్లకి వీలుపడదు కదా! చదువుకానీ, తెలివి కానీ, లేనివాళ్ళు గుడ్డిప్రేమలో పడటంలో ఆశ్చర్యమేమీ లేదు. కానీ, మంచి విద్యాభ్యాసం మరియు ఆలోచనాశక్తి ఉన్నవాళ్ళు ప్రేమ విషయానికొచ్చేసరికి, తమ వివేకము, వివేచనాశక్తి ఎందుకు కోల్పోవాలి. ఒక అమ్మాయి, ఒక అబ్బాయిని సెలెక్ట్ చేసుకోవాలన్న లేదా అటునుంచి ఇటైనా అది తల్లిదండ్రులు కళ్ళు మూసుకొని ఆమోదించేందుకు వీలుగా ఎందుకు చెయ్యకూడదు? తెలివితక్కువగా చేసుకునే ప్రేమవివాహాలు, ఆ దౌర్భాగ్య దంపతుల, వాళ్ళ తల్లిదండ్రుల పూర్వజన్మ పాప ఫలమని హిందూపండిత మతం.

కానీ, సర్దార్జీ కులంలో పుట్టినవాళ్లు అలాంటి పూర్వజన్మ పాపాలు చేసి ఉండరు. ఎందుకంటే, ఆ కులంలో తొంబైశాతం యువకులు, ఆ కులం వాళ్ళనే ప్రేమిస్తారు బాల బాలికల మధ్య ప్రేమ అంకురించడం సహజం. ఇక్కడ ఒక చిన్న హెయిర్ స్ప్లిటింగ్, అంటే కేశ విశ్లేషణం అవసరమవుతుందేమో! బాల బాలికపదంలో మొదటి భాగమైన "బాల్" హిందీ నుంచి తీసుకున్నాము. ఈ విధంగా భాషలను కలగా పులగం చేయకుండా ఉండే విధానం కూడా ఉంది. పౌరాణిక జ్ఞానం కలవాళ్ళకి, మానవ సమూదాయంలో మొదటి సర్దార్జీ కేశవుడేనని, తెలిసుంటుంది. ఈ కాలపు సర్దార్జీలలాగే, ఆ కాలపు కేశవుడు కూడా, తలమీద జుట్టు ముడేసుకునేవాడు. ఆ పురాణకాలంలో బట్టల కరువు వల్ల మగవాళ్ళే కాక ఆడవాళ్ళు కూడా ఊర్ధ్వభాగాన్ని నగలతో కానీ, పూలమాలలతో కానీ, ఆచ్ఛాదించేవారు. చిన్నప్పుడు ఆ కేశవుడు చందనచర్చిత నీలకళేబరుడుగా ఉండేవాడట.... అంటే, ఈ కాలపు బాడీపెయింటింగ్ ఆ కాలంలో కూడా ఉండేదన్నమాట. ఆ పాతకాలపు వస్త్రక్షామం వల్లనే ఆనాటి కేశవుడు ఈనాటి కేశవులలాగానే టర్బన్ అనే తలపాగా ధరించలేకపోయేవాడు. ఈ టర్బన్ అనే తలపాగాకి కావాల్సిన వస్త్రంతో నలుగురైదుగురు గోపికలు తమ సిగ్గుని కాపాడుకోవచ్చు. ఈ కరువు వల్లే కాబోలు, తలపాగా ఉండాల్సినచోట ఆ చిన్నికృష్ణుడు ఒక నెమలి పింఛంతో పాటు పూలచెండు ధరించేవాడు. ఈ ఆధునిక కేశవులలాగే ఆనాటి కేశవుడికి కూడా పాలు, వెన్న అంటే పరమప్రీతి. మహాభారతకాలపు కేశవుడు, మాంసాహారి అవునా కాదా అనే విషయం మనకి తెలియదు కాని, ఆయనకి ఇంద్రుడు చేసినట్లు కుక్కుట వేషధారణ మాత్రం ప్రీతికరంగా ఉండేదని మనకు తెలుసు. ఈనాటి సర్దార్జీలలాగా ఆ

మధురలో ద్వారకలో మసలిన కేశవుడు, పచ్చి ఉల్లిపాయలు తిన్నాడా లేదా అని తెలుసుకోవాలంటే, అతనికి చాలా దగ్గరగా వెళ్ళి మాట్లాడే సత్యభామా, రుక్మిణిలను అడగాల్సి వస్తుంది.

ఆ శ్రీకేశవుడు సర్దార్జీ అని, ఈ రోజుల్లోని సర్దార్జీలందరూ హిందువులనా మీ అభిప్రాయం? అందుకు సందేహమేమిటి? దుష్టశిక్షణకి, శిష్టరక్షణకే కదా, ఆ భగవంతుడు యాదవుడుగా అవతరించాడు. అదేవిధంగా, హిందూ మతరక్షణకే కదా ఈ సర్దార్ అవతారం? హిందూ కుటుంబాల్లో ఎంతో మంది ప్రథమపుత్రులు హిందూత్వ భద్రత కొరకు ఈ గడ్డాలూ మీసాలు పెంచడం అంత అరుదేమీ కాదు. కొంతమంది తిరుపతి మొక్కు తీర్చుకునే ముందు అలా పెంచుకోవడం అలవాటేకదా! శబరిమలకు వెళ్ళేవాళ్ళు కూడా అలాంటి నిష్టపెట్టుకుంటారు.

దేవుళ్ళ పేరు చెప్పి చాలా మంది మనుష్యులు ఈ విధంగా జుట్లు పెంచుకుంటారు కానీ, మనకు తెలిసిన దేవుళ్ళందరూ "క్లీన్‌షేవన్"గా ఎందుకుంటారు? దానికి ఒక ప్రత్యేక కారణముంది. ఈ దేవుళ్ళని హిందూ దేవుళ్ళు అంటున్నా, వాళ్ళు సర్వచరాచరాలకు పరమాత్మలేకదా! అందుకే, వారికి హిందువులపట్ల మాత్రమే పక్షపాతం ఉండకూడదు. నూటికి నూరుపాళ్ళు హిందూవేషం ధరించడం కూడా తప్పే. ఈ ప్రపంచ జనాభాలో మెజారిటీ చైనావాళ్ళే కదా! అందుకే, మన దేవుళ్ళ వదనాలు, విశాలమైన వక్షస్థలాలు క్లీన్‌షేవన్‌గా కనిపించడానికి కారణం, ఆ భాగాలు చైనావాళ్ళని ప్రతినిధానం చేయడమే. దేవుళ్ళకు రోజూ క్షవరం చేసుకోవాలనే బాధ ఉండదు. చైనావాళ్ళకు ఉన్నట్లు అక్కడా ఇక్కడా ఐదారు వెంట్రుకలు ఉంటే వాటిని వాళ్ళు పీకేస్తారు.

ఈ సందర్భంలో త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను పక్కన పెట్టేసి, చతుర్ముఖ్‌సింగ్, నారాయణ్‌సింగ్, శంకర్‌సింగ్‌ల గురించి మాట్లాడటమే సమంజసం కదా!

సాధారణంగా, శబరిమలకు గానీ, తిరుపతికి గానీ, వెళ్ళడానికి గడ్డం పెంచేవారు ఆడవాళ్ళకి దూరంగా ఉండాలనేది ఆ భక్తి నిష్ఠలలో ఒక భాగం. ఆవిధంగా గడ్డాల వాళ్ళు స్త్రీలకు దూరం కాకపోయినా, గడ్డాల వాళ్ళకు దగ్గరగా వెళ్ళడానికి మామూలు ఆడవాళ్ళకు కొంచెం అసహ్యంగానే ఉంటుంది. సర్దార్జీ కుటుంబాలలోని స్త్రీలకు గడ్డాలు, మీసాలని భరించడం వలన కష్టం కాదని మాత్రం కాదు, అవి లేనివాళ్ళు పూర్ణపురుషులు కాదని వారికి ఒక అభిప్రాయం కూడా ఉంటుంది. సర్దార్జీలందరికీ సింగ్ అనే పేరెందుకు పెట్టారు? వాళ్ళందరూ సింహాలని దాని అన్వయం. జూలు లేని కేసరి ఒక కేసరేనా? అందుకే,

పురుషులందరికి గడ్డం, మీసం తప్పకుండా ఉండాలని ఆ సమూదాయంలోని స్త్రీ పురుషుల ఏకగ్రీవ అభిప్రాయం. వ్యక్తిగతమైన అసక్తివల్ల కానీయండి, ధర్మవిశ్వాసం వల్ల కానీయండి. కేశవకుమారీ, కుమారులు. తమ సముదాయంలోనే జీవిత భాగస్వామిని ఎన్నుకోవడం, ఆ సముదాయం యొక్క ఏకమతీభావానికి ప్రకటదృష్టాంతమే.

పర్వీందర్ అనే మన నాయిక ఇంటర్మీడియట్ వరకూ చదువుకుంది. ఇంటర్మీడియట్ మొదటిసారి ఫెయిల్ అయ్యేటప్పుడు ఆమె వయసు ఇరవై. దానిని బట్టి ఆమెకు చదువుపట్ల గల అభిరుచి అర్థమవుతునే ఉంది కదా! పుస్తకాల గురించి కానీ, పాఠ్యవిషయాల గురించి కానీ, ఆమె ఎప్పుడూ ఆలోచించలేదు. మరుసటిరోజు ధరించాల్సిన షల్వార్ కమీజు గురించి తీసుకునే సమయం, శ్రద్ధాభక్తులను చదువుపైకి మళ్ళించి ఉంటే, ఆమె ప్రతి పరీక్ష ఫస్ట్‌క్లాసులో పాసయ్యి ఉండేది. స్నేహితులతో కలిసి సినిమాలకు, షికార్లకు వెళ్ళడం గూర్చి ఆమె ఆడె అబద్ధాలు, సాంకేతిక నైపుణ్యత, వృత్తిపరంగా చూపించినట్లయితే, ఆమె ఒక గొప్ప క్రిమినల్ లాయర్ అయ్యి ఉండేది. చూడటానికి ఒక మోస్తరుగా, చాలా చురుగ్గా ఉన్న ఆ సర్దారిణీ తరుణి వెనుక ఎంతో మంది రోమరోమియోలు లైన్‌లో నిలబడ్డారు. కానీ, ఆమెకు స్థిరమిత్రుడిగా అవతరించింది కమల్‌నయన్‌సింగ్ అనే సబ్ ఇన్స్‌పెక్టర్ సైన్యంలో హవల్దార్‌మేజర్‌గా రిటైరయిన తరువాత విజయవంతంగా వాణిజ్యరంగంలో విరాజిల్లుతున్న ఆమె తండ్రికి పోలీసు డిపార్ట్‌మెంట్ పట్ల గల ఒకే ఒక తిరస్కారభావంతో కమల్‌నయన్‌సింగ్‌ని ఏదైనా రోడ్డు ప్రమాదంలో గానీ, ఎన్‌కౌంటర్‌లో గానీ చంపిస్తామని బెదిరించి, టైర్ల వ్యాపారి అయిన జోగీందర్‌సింగ్‌తో ఆమె వివాహాన్ని జరిపించాడు, ఆ మిలటరీవాడు.

పెళ్ళయ్యాకా, ఆమె తన భర్తని గాఢంగా ప్రేమించింది. స్వంత మారుతీ గలవాడైన బిజినెస్‌వాడే, మోటర్‌సైకిల్ వాడైన పోలీసువాడికంటే ఎక్కువ సుఖ సౌకర్యాలు ప్రసాదించగలడని ఆమెకు అర్థమయ్యింది. అయినా కానీ, ఆ పంకజనేత్రుడ్ని పూర్తిగా మర్చిపోవడానికి గానీ, అతనితో టెలిఫోన్‌లో మాట్లాడకుండా ఉండటానికి గానీ, ఆమెకు సాధ్యం కాలేదు. దీని గురించి, ఆ నవదంపతుల మధ్య అప్పుడప్పుడు చిన్న అభిప్రాయభేదాలు, చిఱుబుఱ్ఱులు చిరు కలహాలు కలుగుతూ వచ్చాయి కానీ, ఆ పటాలం మామ గురించి చాలా భయంతో ఉండే ఆ భర్తకి, ఆ పటాలం గాడి కూతురికి కోపం తెప్పించడానికి ధైర్యం చాల్లేదు.

జోగీందర్, పర్వీందర్‌ల పెళ్ళి ఒకానొక జనవరి పదిహేనున జరిగింది. ఆ సంవత్సరపు గాంధీ జయంతి రోజు కొడుకు పుట్టడం వలన, పర్వీందర్ ఇంటివాళ్ళు, జోగీందర్

ఇంటివాళ్ళు కలిసి అతనికి కరమ్‌మోహన్‌సింగ్ అని నామకరణం చేయడం జరిగింది. దాదాపు తొమ్మిదిన్నర పౌండ్లు బరువు గల ఆ అబ్బాయి తలపై దాదాపు ఒకటిన్నర అంగుళాల జుట్టు ఉండటం వలన అతనొక ఆజన్మహిప్పీ అని కొంతమంది అభిప్రాయపడ్డారు. సదా నవ్వుతూ, సంతోషంగా ఉండే ఆ శిశువుకు కొంతమంది హిప్పీ హాపీ అనే ఒక అపరాభిధానం కూడా ఇవ్వడం జరిగింది. మూడు నెలల్లోనే ఆ అబ్బాయికి పళ్లు రావడం మొదలయ్యాయి. ఆరేడు నెలల్లోనే అతను నడవడం, పరుగెత్తడం మొదలుపెట్టాడు. ఆ చిన్న వయస్సులోనే కొన్ని పదాలు పలకడం కూడా అతనికి సాధ్యమైంది.

ఆ బిడ్డ అభూతపూర్వమైన వికాసం చూసి ఇరుగు పొరుగు వారందరికి ఆశ్చర్యం కలిగింది. ఆ బిడ్డలో ఏదో దైవత్వం ఉందని వారికి అనిపించింది. అద్భుత సిద్ధి గల పిల్లలు వినడమే కానీ, ఇంతకుముందు కొన్ని కాలాల్లో కొన్నిచోట్ల అలా జరగడం మనం వినే ఉన్నాము. నారాయణుడి అవతారాలైన రాముడు, కృష్ణుడు చాలా చిన్నప్పుడే తమ చేష్టలతో అందరినీ ఆవ్చర్యచకితులని చేసినట్టు కూడా విన్నాము. కానీ, రామలీల అని విన్నప్పుడు కొందరు ఆశ్చర్యంతో కనుబొమ్మలు ముడివేయవచ్చు. ఎందుకంటే అలాంటి ఒక అధ్యాయాన్ని గురించి ఎవరూ విని ఉందరు. రామలీల అని అన్నప్పుడు మనకి గుర్తువచ్చేది రామ్‌లీలా మైదాన్ మాత్రమే. మర్యాదరాముడిని గురించి వినేటపుడు మనకి అతనిపైన ఒక సహాతాపభావం కలుగుతుంది. ఎందుకంటే, పాపం అతని జీవితమంతా చాలా కష్టాలలోనే గడిచింది కదా! పెళ్ళి తరువాత కూడా బ్రహ్మచారిగా బ్రతికే దురదృష్టం ఆ జానకీరాముడికి కలిగింది కదా! వయసులోనూ, శారీరక బలంలోనూ, ఆధిక్యతలో ఉన్న సీతకే ఆ కుటుంబంలో ఎక్కువ ప్రాధాన్యత. అందుకేకదా, ఆ జూనియర్ భర్తకి సీతారాముడు, సీతాపతి, ఇత్యాది కేరాఫ్ ఎడ్రస్‌లు వచ్చింది. సీత మాటకి ఎదురు చెప్పే ధైర్యం రాముడికి ఉండేదా? రాముడు వనవాసానికి వెళ్ళేటపుడు, అతని శ్రీమతిని ఎవరూ ఆహ్వానించలేదు. కానీ, రాముడిని వంటరిగా వనవాసానికి పంపకూడదని ఆ స్త్రీస్వయంగా నిర్ణయం తీసుకుంది. చిన్నా చితకా పనులు చేయడానికి లక్ష్మణుడిని కూడా తీసుకువెళ్ళాలని, ఆ వదినగారే నిర్ణయించి ఉంటారు. ద్వాపరయుగంలో ద్రౌపదీ సంతోషం కోసం భీముడు సౌగంధికా పుష్పం తీసుకురావటానికి ఉరుకులు, పరుగులతో వెళ్ళినట్టు అంతకుముందు త్రేతాయుగంలో సీతామహాలక్ష్మి బంగారులేడిని సజీవంగా కానీ, నిర్జీవంగా కానీ కావాలని కోరితే, అస్త్ర శస్త్రాలతో ఆ జానకీ వల్లభుడు మారీచవేటకు వెళ్ళిన సంఘటన రామాయణ పాటకులందరికీ సుపరితం. సరే, ఒక భర్తగా, రాముడు అలాంటి పొరబాటు చేశాడు. కానీ, సీతాదేవి అజ్ఞమేరకు లక్ష్మణుడు కూడా బయటకు వెళ్ళవలసి వచ్చినపుడు ఆయన చాలా కష్టపడి ఒక గీత గీయడం జరిగింది.

కానీ, ఆ రావణుడు తీసుకువచ్చిన హెలికాప్టర్‌లో కొంచెంసేపు గగనయానం కాంక్షించిన ఆ వాహనరహిత వనిత, లక్ష్మణరేఖను పూర్తిగా నిర్లక్ష్యంచేసి దాన్ని దాటివెళ్ళకపోతే పాస్‌పోర్టు, వీసా లేకుండా శ్రీలంకాదర్శనం ఆమెకు సాధ్యం అయ్యేదికాదు. రాముడుపళ్లుపటపటా కొరుకుతూనైనా దానిని సహించాడు. తన కస్టడీలోకి సీతను తీరిగి తీసుకురావడానికి, రాముడు, మోసాలు హత్యలు వంటి అపరాధాలు చేసి చివరకు రావణబ్రహ్మను శంకరుడి దగ్గరకు పంపించారు.. తనను, తన తమ్ముణ్ణి ధిక్కరించిన వైదేహి తనచేతికి దక్కగానే, ఆమెను అగ్నిపరీక్షకు గురిచేయడమే కాకుండా, అయోధ్యా లాండ్రీహౌస్ యజమాని అభిప్రాయాన్ని మన్నించి ఆమెను అరణ్యానికి పంపించడం కూడా జరిగింది. అలా పంపించడంలో తప్పేముంది? ఆకాలంలో, అయోధ్యలో మెటర్నిటీ నర్సింగ్‌హోమ్ అనేది ఉండేదికాదు. అదే సమయంలో వాల్మీకి ఆశ్రమంలో ప్రసవపూర్వ ప్రసవానంతర శుశ్రూషలకు కావాల్సిన ఏర్పాట్లు కూడా ఉండేవి.

ఈ విధంగా, మొత్తం రామాయణంలో రామలీల అనే ఒక అంశం కృష్ణలీల విషయంలో అలాకాదుకదా. చిన్నతనంలో అతనుచెయ్యలేని ఆగడాలు లేవు. పుట్టడమే జైలులోపుట్టిన ఆ దొంగకృష్ణుడికి ఏ దుష్కృత్యాలు చేయాలన్నా, సంకోచం కానీ, భయంకానీ ఉండేవి కావు. పుట్టడమే అగ్గిలో అయితే ఎండలో వాడిపోదు అనే సామెత ఉందికదా. కృష్ణుడి శైశవకాలమంతా అద్భుత సంఘటనలతో నిండి ఉంది. పొత్తిళ్ళలో ఉన్నప్పుడే **పూతన** అనే ఒక సాధు స్త్రీ స్తనదుగ్ధపానంచేసి ఆమె జీవరసం కూడా పీల్చి, ఈ కాలపుభారతీయ **శిక్షాస్మృ**తి లోని మూడువందలరెండవ నిబంధనలో ఉన్న అపరాధానికి పాల్పడలేదా? నడక వస్తూనే, పాలు వెన్న అనే వస్తువుల దొంగతనం స్థిరవృత్తిగా చేపట్టాడు. మన్నుతిన్నాడనే అనుమానంతోనోరు తెరవమని యశోద అడిగేసరికి, ఒక టైనీ టీ.వీ. అదీ ఒక కలర్‌టీ.వీ. నోట్లో పెట్టుకుని రిమోట్ కంట్రోల్ ద్వారా ఎన్నో ఛానల్స్ చూపించి ఆమెను అబ్బురపరిచాడు. మరికొంచెం ఎదిగిన తరువాత, ఈవ్ టీజింగ్ అనే ఒక హాబీ, కాళీయుడు అనే బురదపాముతో పాటు డిస్కోడాన్స్‌చేయడమనే ఎన్నెన్నో కార్యక్రమాలు చేపట్టడం జరిగింది

మన సర్దార్జీబిడ్డ అలాంటి అద్భుత విన్యాసాలేమీ చేయలేదు కానీ, ఆ అబ్బాయికీ మూడవ నెలలోనే పళ్ళు రావడం, ఏడో నెలలోనే మాట్లాడటం చూసి, ఇరుగుపొరుగు వాళ్ళకు అతను ఒక అసాధారణ శిశువు అని అనిపించడంలో అసాధారణత్వం ఏమీలేదు. బొద్దుగా, ముద్దుగా ఉన్న ఆ అబ్బాయి పుష్కల కేశాల గురించి ఆ ఇంటివారికి ఎంతో గర్వంగా ఉండేది. జోగిందర్ సింగ్ తలపాగాలో కాస్తబట్టతల దాగి ఉందని ఇతరులకు

తెలియదు. కానీ, దాని గురించి మనఃక్లేశం అనుభవిస్తున్న అతనికి, కొడుకు తలపై ఉన్న రోమభాగం అతనికి రోమహర్షకారకమైంది. ఆ అబ్బాయి అసామాన్యమైన పెరుగుదల గురించి, అతని అసాధారణ సామర్థ్యాల గురించి, పర్వీందర్‌కు పట్టలేని ఆనందం కలిగింది. ఆ విధంగా, ఆ భవనం ఉల్లాసంతో నిండి ఉండేటపుడు...

ఒకరోజు.....ఉదయం లేవగానే, ఆ బాలకుడు గర్జించాడు.

"బాప్‌కోణ్"

అతన్ని లేపిన అతని ఏకైక తల్లిని చూసి, మళ్ళీ మళ్ళీ అరిచాడు, "బాప్‌కోణ్"?. బాప్‌కోణ్?"

పర్వీందర్‌కు ఆ పదం స్పష్టంగా వినపడటంతో ఒక్కసారిగా అదిరిపడింది. ఏమిటీ వీడి ప్రశ్న! ఆ చుట్టుపక్కల ఎవరూ లేకపోవడం నయమైంది. మళ్ళీ పేచీపెడుతూ, ఏడుస్తూ, అరవడం సాగించాడు. "బాప్‌కోణ్? బాప్‌కోణ్?" వెంటనే ఆమె పాలసీసా ఆ పిల్లవాడి నోటిలోకుక్కేసింది. తాత్కాలికంగా ఆ ఏడుపు ఆగింది. బాగా ఆకలిమీద ఉండటంచేత, ఒక్కవిల్పులో పాలు మొత్తం తాగేసాడు. ఆవని పూర్తికాగానే, వాడు మళ్ళీ మొదలుపెట్టాడు....."బాప్‌కోణ్?...బాప్‌కోణ్?.

ఆమె ఖంగారుగా కొన్ని చాక్లెట్లు తెచ్చి ఆ అబ్బాయి చేతిలో పెట్టింది. వాటిని ఆ అబ్బాయి నేలమీదకి విసిరికొట్టి, తనపల్లవి ఎత్తుకున్నాడు.

"బాప్‌కోణ్? బాప్‌కోణ్?"

ఆ అబ్బాయికి మధురమైన భోజ్య పదార్థాలంటే అంత ఇష్టం ఉండేది కాదు.

సాధారణంగా, పిల్లలందరికి కారపు వాస్తువులంటే ఇష్టముండదు. కానీ, ఇతనికి వాటితోనే ప్రతిపత్తి, ఆ విషయం ముందుగానే తెలిసిన ఆ తల్లి వాడికి ఏవో కొన్ని కారపు వస్తువులు తినడానికి ఇవ్వడంతో ఆ ఏడుపు తాత్కాలికంగా ఉపశమించింది.

ఇటువంటి ప్రశ్నార్థకమైన మారాము, ఏడుపు, సమయం సందర్భం లేకుండా మళ్ళీ మళ్ళీ పుట్టుకొచ్చింది. ఇతరుల ముందు వాడిలా ఏడుపూ, పేచీ మొదలు పెట్టేటప్పుడు, ఆమె వాడిని రహస్యంగా గిచ్చిందనే అనుకోండి. వాడి ఏడుపు, అరుపు, ఇంకా తారాస్థాయిని అందుకునేవి.

తన బంగారు బిడ్డ యొక్క దుర్‌గ్రాహ్యమైన ఆ మొండితనం గురించి, జోగిందర్ సింగ్‌కు, ముందు అశ్చర్యం కలిగింది. చుట్టుపక్కల ఎవరూలేనప్పుడు, అతను "బాబూ!

నేనే నీ తండ్రిని, నేనే నీ తండ్రిని" అని సమాధానం చెప్పేవాడు. కానీ, ఆ సమాధానం అతని శ్రవణేంద్రియాన్ని చేరలేదన్నట్టుగా, వాడు తన చోద్యపరంపరను కొనసాగించేవాడు. అప్పుడప్పుడు వాడు తనంతటతానుగా ఏడుపు ఆపేవాడు. తినటానికి కారపు వస్తువులేమీ ఇవ్వనప్పుడు కూడా, టీ.వీలో అతనికి నచ్చిన ప్రోగ్రామ్స్ వచ్చినపుడు, ఆ ఏడుపు ఆపేసేవాడు. ఎప్పుడైనా ఒకసారి వాడు ఆ ఏడుపు ప్రాంభించగానే, కోపం వచ్చిన తండ్రి జోగీందర్‌సింగ్, "నన్నెందుకు అడుగుతావు? అది మీ అమ్మకే బాగా తెలుసు. వెళ్ళి ఆమెనే అడుగు" అని అరిచేవాడు.

అది పర్వీందర్‌కి వినిపిస్తే మాత్రం, ఆమెకి అతన్ని చంపెయ్యాలన్నంత కోపం వచ్చేది.

"చిన్నపిల్లాడితో ఇలాగేనా మాట్లాడాల్సింది. వాడినోరుమూయించటం చేతకాక, బాధ్యత లేకుండా ఏమిటి మాటలు?"

"నాకు తెలియని విషయాల గురించి వాడికి నేనెలా చెప్పగలను?" అని అతను చేతులు ఎత్తేటప్పుడు, ఆమె కోపం ద్విగుణీకృతమవుతుంది.

"ఏమిటంటున్నారు? మీకు ఆ విషయం గురించి తెలియదా?"

"అతని తండ్రినేనే అని చెప్పడానికి నేను సిద్ధంగా ఉన్నాను. కానీ, వాడది నమ్మడం లేదే, దానికి నేనేం చేయాలి?"

"మీకేమయినా మతిపోయిందా? చంటిపిల్లవాడు ఏదో వాగితే మీరు దానికి ఇలాంటి జవాబిస్తారా? వాడడిగే ప్రశ్న వాడికే తెలియదు. ఇంత చంటిపిల్లవాడి నోటివెంట ఏవోశబ్దాలు బయటికి వస్తే, వాటికో అర్థం తీసిరాద్ధాంతం చేయడం తప్పు. వాడికి ఏదో కావాలి కాబోలు, ఏడుస్తున్నాడు."

"కానీ, ప్రశ్నమాత్రం చాలా స్పష్టంగా అడుగుతున్నాడే! ఎవరయినా వింటే నాకే గదా సిగ్గుచేటు?"

"అంటే, నాకు మొదట్నుంచీ సిగ్గులేదంటారా?" ఆమె కళ్ళ నుంచి ఉదజని, ఆమ్లజని, కొద్దిగా లవణం కలిసిన ద్రవం స్రవించడం మొదలుపెట్టింది. పర్వీందర్ అనే సర్దారిణీ చిన్న చిన్న విషయాలకు ఏడ్చే ఘటం కాదు.

"ఆ ఉద్దేశంతో నేను అనలేదే. అతనెందుకు ఇలాంటి ప్రశ్నలు వేస్తున్నాడనేది నాకు అర్థం కావటంలేదు."

"ప్రశ్నకాదు, పాడూకాదు. తినడానికి ఏమైనా కారంగా ఇస్తే ఊరుకుంటున్నాడు కదా!"

క్రమక్రమంగా వారిరువురికి తెలియకుండానే, వారి మధ్య ఎడం పెరుగుతూ వచ్చింది. వారిద్దరి దగ్గరి బంధువులకు కూడా ఈ అబ్బాయి పదేపదే అంటున్న మాట గురించి ఆశ్చర్యంతో పాటు బాధకూడా కలిగింది.

ఆ అబ్బాయి మళ్ళీ మళ్ళీ అడుగుతున్న ఆ ప్రశ్నను వినే సద్భాగ్యం కలిగిన ఇరుగు పొరుగువారికి బ్రహ్మానందం సినిమా చూసినంత, పరమానందయ్య శిష్యులకథ సీరియల్ చూసినంత సంబరం కలగడమే కాకుండా, రోజుల తరబడి హాస్యచర్చలు జరపడానికి కావలసిన మందుగుండు కూడా లభించింది.

పర్వీందర్ ప్రవర్తనలో అతనికి ఏవిధమైన అనుమానం కలగలేదు కానీ, ఆ చిన్న సర్దార్జీ మళ్ళీ మళ్ళీ అడుగడం వలన, అతనికి మనసులో అశాంతి పెరుగుతూ వచ్చింది. జనవరి పదిహేనున పెళ్ళి జరగడం, అక్టోబరు రెండుకే ఆ బిడ్డ జన్మిండం గురించి, అతను ఆలోచించకుండా ఉండలేకపోయాడు. ఎనిమిదిన్నర నెలలే ప్రసవం జరిగితే, దానిని ప్రిమెచ్చూర్ డెలివరీ అంటారు. కానీ, ప్రసవ సమయంలో కర్‌మోహన్‌సింగ్ తొమ్మిదిన్నర పౌండ్లు ఉండటం వల్ల అతనొక ప్రిమెచ్యూర్ బేబీ కావడానికి వీలులేదు. తనకి అవగాహన లేని విషయాల గురించి ఆలోచించి, తన తలపాగా కింద అనవసరమైన తాపోగ్రత కలిగించుకోకుండా ఉండటమే మేలని అతనికి తోచింది.

"బాప్‌కోణ్" అనే ప్రశ్నావళి మాత్రం ఎలాంటి క్రమం లేని క్రమంలో ఉత్పాదితమవుతూ వచ్చింది. ప్రతిరోజూ అలాంటి ప్రశ్నను అతను ఎత్తడు కానీ, ఆ అరుపు, ఆ ఏడుపు, ఎప్పుడు ఎక్కడ జరుగుతుందనే దానికి ఎలాంటి నిశ్చితత్త్వం ఉండేది కాదు. ఆ విధంగా, ఆ చిన్న సర్దార్జీ అప్పుడప్పుడు పేలుతున్న అగ్నిపర్వతంలా, ఆ గృహవాతావరణాన్ని కలవరపరచసాగాడు.

ఒకరోజు సాయంత్రం, జోగీందర్ భార్యాబిడ్డలతో కలిసి సినిమాకు వెళ్ళాడు. సినిమా అంటే ఆ లేతకేశవుడికి కూడా ప్రేమే. మొదటినుంచి చివరివరకూ ఎలాంటి శబ్దంచేయకుండా, అతను ఆచలనచిత్రాన్ని కన్నార్పకుండా చూస్తూ ఉండేవాడు. ఆకలిని మాత్రం, వాడు సహించగలిగేవాడు కాదు. అందుకే, అలా సినిమాలకు వచ్చేటప్పుడు పర్వీందర్ బ్యాగ్‌లో రెండు పెద్దసీసాల నిండా పాలు రెడీగా ఉంటాయి.

సినిమా ప్రథమార్థం చాలా రసవత్తరంగా సాగిపోయింది. ఇంటర్వెల్ సమయంలో లైట్లన్నీ వెలిగాయి.

ఆకస్మికంగా ఉరుములాంటి పెద్దశబ్దం వెలువడింది ఒక చిన్న నోటినుంచి "బాప్‌కోణ్..బాప్‌కోణ్?"

పర్వీందర్, జోగీందర్ ఒక్కసారిగా నిర్ఘాంతపోయారు. అతని నోట్లో పాలసీసా పెట్టి చూసింది కానీ, వాడు ఆ పాలసీసాని పక్కకి నెట్టేసి, పర్వీందర్ వడిలోనుంచి లేచి నిల్చుని గెంతులు వేస్తూ ఆరవడం మొదలు పెట్టాడు... "బాప్‌కోణ్? బాప్‌కోణ్?" సినిమా చూడటం మానేసి, ఇంటికి తిరిగి వెళ్ళిపోదామని వాళ్ళు ఆలోచించారు. అంతలో, జోగీందర్‌సింగ్ పక్కన కూర్చున్న వ్యక్తి, ఆ న్యూసెన్స్ భరించడం కష్టంగా ఉన్నట్లు లేచి బయటకు వెళ్ళిపోయాడు. రెండు మూడు నిముషాల తర్వాత అతను తిరిగి సీట్లో వచ్చి కూర్చున్నాడు. కరమ్ మోహన్‌సింగ్ చిట్టి చిట్టి చేతుల్లో ఒక పాప్ కార్న్ పెట్టడంతో వాడి ఏడుపు సడన్‌బ్రేకు పడినట్టు ఆగింది. సంతోషంతో కూడిన ఒక అమాయకపు పసిబాలుడి పకపకలు ఆ బాల్కనీలో ఉన్న మిగతా ప్రేక్షకులకు వేసవి కాలపువడగళ్ళలా అనిపించింది.

ఓరి దేవుడా! ఇంతకాలం వీడి ఏడుపు దీని గురించేనా? ఇంత సాధారణ విషయం తమకెందుకు తట్టలేదు! ముక్కూ మొఖం ఎరుగని పక్కసీటు వాడు ఒక్కక్షణంలో గ్రహించగలిగాడని జోగీందర్‌సింగ్ అనుకుని ఉండవచ్చును. పాప్‌కార్న్ డబ్బులు అతనికి ఇవ్వడానికి జోగీందర్ ప్రయత్నించాడు. కానీ, అతను తీసుకోలేదు. ఆ ధర అతనికి అప్పుడే వసూలయిపోయింది. ఆ చిన్నారి బాబు దరహాసం నుంచి.

సినిమా ఉత్తరార్థం చూస్తున్న జోగీందర్ సింగ్‌కు, తను గగనవిహారం చేస్తున్నట్టు అనిపించింది. అనుమానాల కారుమేఘాలు ఎక్కడికో పారిపోయి దాగడం వలన ఆ నిర్మలాకాశం అతనికి ఎంతో హృద్యంగా గోచరించింది. పతివ్రత అయిన తన అర్థాంగిని అనవసరంగా అనుమానించడంలో అతనికి అతి పశ్చాత్తాపం కలిగింది. ఇక ముందెన్నడూ కూడా తన భారతనారి యొక్క భావశక్తిని శంకించను అనే దృఢనిశ్చయం సినిమా చూస్తుండగానే తీసుకోగలిగాడు. దానితో తన తలమీద "టర్బన్" ఎంతో తేలికైనది అని అతనికి అనిపించింది.

అదే సమయంలో, పర్వీందర్‌కు కూడా దాదాపు ఆ అనుభూతే అనుభవమైంది. జవాబు లేని ప్రశ్నాస్త్రాలు ఆ చిన్నబిడ్డ నుంచి రావడం మొదలు పెట్టిన రోజునుండి, ఆమె గుండెల మీద ఒక బండరాయి పెట్టినట్లున్న క్లేశానుభవం ఆమెను పీడిస్తూ వచ్చింది. రోజులు గడుస్తున్న కొద్దీ, ఆ బిడ్డవేస్తున్న అదే ప్రశ్నను గురించి ఆమె మనోభారం పెరుగుతూ వచ్చింది. చలనచిత్ర విరామవేళలో జరిగిన సంఘటన, ఆ తల్లికి కలిగించిన ఆనందం, అమోఘం అవర్ణనీయం.

ఆ రాత్రి ఆ దంపతుల పడకగదిలో ఒక దీర్ఘసంభాషణా పర్వం అనే ఆరంగ్రేటం జరిగింది. పర్వీందర్ సర్దారిణీకి పూలన్‌దేవికి ఉన్నంత ధైర్యం వచ్చేసింది. దొంగవస్తువులతో సహాపట్టుకోబడిన ఒక జేబు దొంగను కేసులు పట్టుకోవడంలో అసమర్థుడైన ఒక సబ్ యిన్‌స్పెక్టర్ ఇంటరాగేట్ చేస్తున్నట్టు, దక్కిన అవకాశం చేజారిపోకుండా, పర్వీందర్ తన భర్తను దయాదాక్షిణ్యం లేకుండా శిలువ వేయదానికి ప్రయత్నం చేసింది. క్షమాయాచన తప్ప ఆ పతిదేవుడికి మరోగత్యంతరం లేకపోయింది.

మరుసటిరోజు నుంచి ఆ ఇంట్లో ఆనందతరంగాలు వెల్లివిరియడంతో పాటు, పరపరమని పాప్‌కార్న్ తినే చప్పుడు వినిపించడం మొదలయ్యింది. ఆ సర్దార్జీబిడ్డ బాప్‌కోణ్ అనే పదం నేర్చుకునే నేపథ్యం ఈ ప్రకారంగా ఉంది.

ఆ సంవత్సరం ఎగ్జిబిషన్‌కు జోగీందర్‌సింగ్, తన బార్యాను, బిడ్డను తీసుకువెళ్ళాడు. ఎగ్జిబిషన్ మొత్తం తిరిగి, ఎన్నోవింతలు, విశేషాలు చూడటం, వినడం జరిగింది. కానీ కరమ్‌మోహన్‌సింగ్‌ని హఠాత్తుగా ఆకర్షించినది మాత్రం పాప్‌కార్న్ సెంటర్. గాజుగూటిలో ఆ పాప్‌కార్న్‌లు పైకి కిందికి ఎగరడం చూసి, ఆ అబ్బాయికి ఎంతో ఆహ్లాదం కలిగింది. కానీ, అది తినడం వలన అతనిలో ఉప్పొంగిన ఆనందం, ఒక నృత్యంలా రూపాంతరం చెందింది. అది చూసి, అతని తల్లిదండ్రులకు కూడా డాన్స్ చేయాలనిపించింది. కానీ, అక్కడ ఒక భ్రాంగ్రా జరిగితే, చుట్టుపక్కల జనం మూగుతారని భయపడి ఆ ప్రయత్నం మొదలు పెట్టకముందే విరమించుకున్నారు.

కరమ్‌మోహన్‌సింగ్ లేతమనసులో ఆ పాప్‌కార్న్ నర్తన దృశ్యం మాసిపోకుండా, అదృశ్యంకాకుండా మిగిలిపోయింది. కానీ, దానిపేరు మాత్రం మరిచిపోయాడు. ఎంతప్రయత్నించినా, వాడికి ఆ పదం మాత్రం గుర్తుకు రాలేదు. టీవీనే గడ్డప్పగించి చూసే ఆ పసివాడు, కోన్ ఐస్‌క్రీం ప్రకటన తప్పకుండా చూసుకుంటారు. బాప్ అనే పదానికి ప్రత్యేకంగా ప్రకటనేమీ చూడక్కరలేదు. ఎందుకంటే, ఆ దైవ పదార్థం ఇంట్లోనే ఉందికదా! అయినా కానీ, ఈ బాప్ అనే పదాన్ని కోన్ అనే పదంతో అనుసంధించడం వాడివల్ల కాలేదు.

బాప్‌కోణ్ అని వాడు అరుపులు మొదలు పెట్టిన రోజు ఉదయం జరిగిన దేమిటంటే.. ఉదయం సుమారు ఏడున్నర గంటలకు తల్లి వాడిని పాలు తాగడానికి లేపింది. అలా నిద్రలేస్తున్న సమయంలో, పక్కగదిలో నుంచి, తండ్రి మాట్లాడిన మాట వాడికి వినిపించింది...
"బాప్‌రేబాప్! ఏడున్నరయ్యిందా!"

జోగీందర్‌సింగ్ ఆమాటలు స్వగతంగా అన్నా, అది పక్క గదిలో ఉన్న వాళ్ళకి కూడా వినిపించింది

బాప్‌రేబాప్ అని ఎవరంటున్నారని అ అబ్బాయి ఆలోచించాడు. ఆ ఆలోచిందం పంజాబీలో కానీ, హిందీలోకానీ జరగాలి కదా! దక్కన్ సర్దార్జీలో చాలామందికి పంజాబీ తెలిసి ఉండదు. అయినా కూడా, వాళ్ళు కొంచెం పంజాబీ స్టైలులో హిందీ మాట్లాడతారు. తెలంగాణాలో ఎక్కువమంది వ్యాకరణశుద్ధిలేని హైదరాబాదు ఉర్దూనే వాడతారు. ఏమైనాసరే, మన చిన్నారి కథానాయకుడు "అక్కడ ఎవరు మాట్లాడుతున్నారు?" అనే ప్రశ్నకు కనిపెట్టిన పదం తప్పకుండా "కోణ్" అయ్యుండాలి. బాప్‌రేబాప్ లో బాప్ అనే పదం, అతని ఆలోచనా సరళిలో మొదటి భాగమైన కోణ్‌అనే శబ్దానికి దగ్గరిగా వచ్చేసరికి, అతని బుర్రలో ఒక మెరుపు మెరిసింది. "యురేకా" అని అరుస్తూ స్నానపుతొట్టిలోనుంచి లేచి, దిసిమొలతో పరిగెత్తిన ఆర్కిమెడిస్‌లాగా, నిద్రలేవగానే కరమ్‌మోహన్‌సింగ్ పెద్దగా అరిచాడు. "బాప్‌కోణ్"!

బాప్‌కోణ్‌నేపథ్యం గురించి పూర్తి వివరణ లభించింది కదా! అయితే ఈ కథని మనం ఇంతటితో ముగించేద్దాం. అనుమానాలూ, అపార్థాలు విడిచిపెట్టిన జోగీందర్‌సింగ్, అగ్నిపరీక్షను అనుభవించిన పతివ్రతారత్నమైన పర్వీందర్, సకల సుఖసౌభాగ్యాలతో జీవితాంతం వర్థిల్లనీయండి. నిజమే. వాళ్ళు అలాగే ప్రేమానురాగాలు పంచుకుంటూ ఇలా రోజులు గడుస్తుండగా......

ఒకరోజు ఏదో పనిమీద జోగిందర్‌కు చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్‌కు వెళ్ళాల్సివచ్చింది. కమల్‌నయన్‌సింగ్ అక్కడ సబ్‌ఇనస్పెక్టర్‌గా పనిచేస్తూ ఉండటం వలన, అతనికి ముందుగానే ఫోన్‌చేసి, తను అక్కడికి వస్తున్నట్టు చెప్పాడు. జోగిందర్‌కు అక్కడమంచి స్వాగతం లభించింది. సబ్‌ఇన్‌స్పెక్టర్ కమల్‌నయన్‌సింగ్ రూమ్‌లోకూర్చోగానే, జోగీందర్‌సింగ్‌ని తాగడానికి ఏంకావాలని పోలీస్‌వాడి ఖాకీప్యాంట్స్, సినిమావాళ్ళలాంటి ప్రింటెడ్‌పిల్స్ షర్టు ధరించిన ఆ "లోటస్‌ఐడ్‌లయన్" అడగడం జరిగింది. సాయంత్రం అయిదున్నర గంటలు కావడం వల్ల, కాఫీ అయితే ఫరవాలేదని జోగీందర్‌సింగ్ చెప్పాడు.

కమల్‌నయన్‌సింగ్ టేబుల్‌మీద ఒక పెద్దప్లేటులో ఏడెనిమిది పేస్ట్రీలు ప్రత్యక్ష మయ్యాయి. అవి కూడా రెండురకాలు. జోగీందర్ ఒక పేస్ట్రీ మాత్రం తీసుకున్నాడు. అతనది తినేలోపునే, ఆ సాక్షాత్ పోలీసువాడు మూడు పేస్ట్రీలు మింగేశాడు. సాయంత్రం వేళ కాఫీతో కూడా ఇంత ఎక్కువ లాగిస్తాడా అని జోగిందర్ కళ్ళు బయటికి పోడుచుకు వచ్చాయి. పాపం, అతను మధ్యాహ్నం భోజనం చెయ్యలేదేమోనని అతను తనకు తానే సమాధానం

చెప్పుకున్నాడు. తర్వాతి ఐటమ్ కాఫీ, పేస్ట్రీచాలా మధురంగా ఉండటం వలన, అది తిన్న వెంటనే కాఫీ తాగితే దాని రుచి తెలియకపోవచ్చు. నాలుకపై నిలిచిపోయిన తియ్యదనాన్ని న్యూట్రలైజ్ చెయ్యడానికి తీపి లేని పదార్థమేదయినా తినడం అవసరమనే కనీసజ్ఞానం ఆ పోలీసాఫీసరుకు ఉంది. తదనుసారంగా, రెండుప్లేట్లు తెప్పించడం జరిగింది.....

పాప్‌కార్న్......పాప్‌కార్న్......

అది చూడగానే జోగిందర్‌కు గుర్తు వచ్చింది, తన బంగారు బాబు పాతగర్జన.....

బాప్‌కోణ్..బాప్‌కోణ్..

ఒకప్లేటులో ఉన్న పాప్‌కార్న్ అంతా ఆ సగం యూనిఫామ్ వాడు రెండు నిముషాల్లో ఊదేశాడు. వాళ్ళిద్దరూ కాఫీ తాగుతూ ఉండగా, జోగిందర్ ప్లేటులో మిగిలిన పాప్‌కార్న్ కూడా కమలనయనుడు స్వాహా చేశాడు. ఇతనికి పాప్‌కార్న్ పట్ల ఉన్న ఆసక్తికీ, తన పసివాడికి పాప్‌కార్న్ పట్ల ఉన్న మక్కువకీ సంబంధం ఏదైనా ఉండవచ్చునే ఒక చిన్న అనుమానం జోగీందర్ మనసులో అంకురించింది.

ఛీ....ఛీ..అలాశంకించడం తప్పు...ఇంతకు మునుపు ఒకసారి అకారణంగా పర్వీందర్‌ను అనుమానించి, ఆమె మనసు గాయపరిచాను. పాప్‌కార్న్ ప్రియులు కోకొల్లలని అనడానికి, దాని వేడివేడి అమ్మకమే దృష్టాంతం. భార్యశీలాన్ని శంకించడానికి దారి వెతకడం మహాపాపం. ధర్మపత్ని శీలం విషయంలో ఒక మంచి భర్త అనుసరించాల్సినది వేరెవ్వర్నీ కాదు. మహాత్మాగాంధీగారి మూడుకోతులని.

ఏదేమయినా, కర్మ్‌మోహన్‌సింగ్‌కు మాత్రం తీపివస్తువులేమీ ఇష్టంలేవు. కానీ, ఈ కమల్‌నయన్‌చూడండి మూడు నాలుగుపేస్ట్రీలు ఒకేసారి తింటాడు.

ప్రతిసంవత్సరం వన మహోత్సవ వారాల సందర్భంగా ఒకే స్థానంలో ఒక వృక్షాన్ని నాటుతున్నట్టు తన భార్యని ఎట్టిపరిస్థితులలోనూ ఇహశంకించకూడదనే దృఢనిశ్చయాన్ని జోగీందర్‌సింగ్ అనే భర్తరత్నం మరొకసారి చేసుకున్నారు.